సాక్షి వికారాబాద్

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



అరుపులు.. దాడులు

వీధి కుక్కల బెడద తగ్గించేందుకు ప్రభుత్వం కోట్లు వెచ్చిస్తున్నా కుక్కకాటు తప్పడం లేదు. 8లో▸



స్థానిక ఎన్నికలకు..

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మోమిన్‌పేట్ ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. 8లో▸



సవరణకు వేళాయె!

వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేసిన అధికారులు ఆయా కార్యాలయాలకు చేరవేశారు. 9లో▸

న్యూస్‌రీల్

బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ దీపక్



కొడంగల్‌రూరల్: మండల తహసీల్దార్‌గా దీపక్ శ్యామ్‌దన్‌దాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పూడూరు మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆయన కొడంగల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న విజయకుమార్ పూడూరుకు బదిలీపై వెళ్లారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

బొంరాస్‌పేట డీటీగా చాంద్‌పాషా



బొంరాస్‌పేట: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా చాంద్‌పాషా శనివారం బాధ్యతలు చేపట్టారు. దౌల్తాబాద్ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గత కొన్ని నెలలుగా డీటీ పోస్టు ఖాళీగా ఉంది. ఎట్టకేలకు నియమించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

త్వరలో సహాయ ఉపకరణాల పంపిణీ

అలింకో జిల్లా ఐఈడీ రజని



మాట్లాడుతున్న రజిని

కొడంగల్ రూరల్: అంగవైకల్యం కలిగిన వారికి అవసరమయ్యే సహాయ ఉపకరణాలు అలింకో ఆధ్వర్యంలో అందించనున్నట్లు జిల్లా ఐఈడీ రజని తెలిపారు. శనివారం పట్టణంలోని భవిత కేంద్రంలో అలింకో నుంచి వచ్చిన వైద్యులు దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌తోపాటు అంగవైకల్య పరీక్షలు, ఉపకరణాల కోసం కొలతలు తీసుకున్నారు. ఎనిమిది మండలాల నుంచి దివ్యాంగులు వచ్చినట్లు రజిని తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఐఆర్‌పీలు పాల్గొన్నారు.

హిందూ ఉత్సవ సమితికి ఎమ్మెల్యే బీఎంఆర్ విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు బీఎస్సార్

తాండూరు టౌన్: తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితికి స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి విరాళం ప్రకటించారు. శనివారం ఆయన సోదరుడు, ఆర్‌టీబీఎల్ కంపెనీ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా సమితి సభ్యులకు రూ.4,01,116 నగదు అందజేశారు. హిందూ ఉత్సవ కేంద్ర సమితికి తమ వంతు సాయం ఎల్లవేళలా ఉంటుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింలు, కోశాధికారి రొంపల్లి సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి రామకృష్ణ, సభ్యులు రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుని కృపతో ప్రజలు క్షేమంగా ఉండాలి

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్



ధన్‌గర్ గల్లీలోని వినాయకున్ని దర్శించుకున్న శుభప్రద్ పటేల్

తాండూరు టౌన్: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని బీసీ కమిషనన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ పట్టణంలోని పలు వార్డుల్లోని వినాయకులను దర్శించుకున్నారు. ధన్‌గర్ గల్లీ, సీసీఐ కాలనీ, గాంధీనగర్, సొరమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని కృపతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, హిందూ ఉత్సవ సమితి కోశాధికారి రొంపల్లి సంతోష్ కుమార్, నాయకులు భాను, సాయి, మనోహర్, దత్తు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాకు రాజకీయ రంగు

రైతన్నకు అండగా రోడ్డెక్కిన బీఆర్‌ఎస్



వికారాబాద్‌లో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు(ఫైల్)

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు సహా 20 మందిపై కేసులు
- 'గులాబీ' తీరుపై అధికార పార్టీ నేతల ఆగ్రహం
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే అంటున్న బీజేపీ నేతలు

- ప్రస్తుత సీజన్‌కు అవసరమైన యూరియా 39,898 మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు సరఫరా చేసింది 20,124 మెట్రిక్ టన్నులు
- అందుబాటులో ఉన్నది 830 మెట్రిక్ టన్నులు

వికారాబాద్: యూరియాకు రాజకీయ రంగు పులుముకుంది. ఎరువుల కోసం రైతులు అవస్థలు పడుతుంటే.. తమ రాజకీయాలకు కాదేది అనర్హం అన్నట్లు పలు పార్టీల నేతలు రాజకీయం చేస్తున్నాయి. అన్నదాత సమస్యను పరిష్కరించడం పక్కన పెట్టి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ రోడ్డెక్కి ధర్నా చేస్తుంటే.. అధికార పార్టీ మాత్రం కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని కొట్టి పారేస్తోంది. బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్న ధర్నాల్లో పార్టీ కండువాలు.. జెండాలు తప్ప పది మంది రైతులు కూడా ఉండటం లేదని అధికార పార్టీ విమర్శిస్తోంది. జిల్లాలో పండించే ప్రధాన పంటలైన వరి, పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు యూరియా వేసే సమయం ఇదే కావడంతో రైతులు పొలం పనులు వదిలి ఎరువుల కోసం క్యూ కడు తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని ప్రైవేటు డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. పీఏసీఎస్, డీసీఎంఎస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలకు కాకుండా ప్రైవేటు డీలర్లకే ఎక్కువ మొత్తం కేటాయిస్తుండటంతో సమస్య ఎదురవుతోంది. డీలర్ల ఎరువులను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బీఆర్‌ఎస్‌కు ఆయుధంగా..

యూరియా కొరత బీఆర్‌ఎస్‌కు ఆయుధంగా మారింది. రైతులకు మద్దతుగా రోడ్డెక్కి ధర్నాలు చేస్తోంది. ప్రభుత్వ తీరును ఎండగట్టే ప్రయత్నం చేస్తోంది. సీఎం, స్పీకర్ సొంత జిల్లాలోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే మిగతా ప్రాంతాల్లో పరిస్థితి ఇంకెంత అధ్వానంగా ఉంటుందోనని ఆరోపిస్తున్నారు. శుక్రవారం పరిగి, ధారూరు మండల కేంద్రాల్లో యూరియా కొరతపై గళం విప్పారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చివరకు అరెస్టుల దాకా వెళ్లింది. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సహా ఆ పార్టీకి చెందిన 20 మంది నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేంద్రం నుంచి సరిపడా ఎరువులు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే కొరత ఏర్పడుతోందని బీజేపీ ఆరోపిస్తోంది. ఎరువులను రైతులకందించే మార్క్‌ఫెడ్ వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండటంతో సమస్యకు బాధ్యత రాష్ట్ర సర్కారే అని కమలం నేతలు అంటున్నారు. ఇటీవల వికారాబాద్‌కు వచ్చిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సైతం యూరియా కొరతపైనే ప్రధానంగా మాట్లాడారు. కేంద్రం సరఫరా చేస్తున్న ఎరువులను పారదర్శకంగా రైతులకు పంపిణీ చేస్తున్నామని కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఈ విషయాన్ని కావాలనే రాజకీయం చేస్తున్నాయని మండిపడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే సీజన్‌లో ఈ నెలాఖరు వరకు ఎంతయితే యూరియా సరఫరా చేశారో ఇప్పుడు కూడా అంతే సరఫరా చేశామని అధికార పార్టీ నెతలు స్పష్టం చేస్తున్నారు.

ఆందోళన వద్దంటున్న అధికారులు

ఎవరైనా యూరియాను బ్లాక్ చేసినా.. అధిక ధరలకు విక్రయించినా కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్సులు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 830 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని.. మరో 100 మెట్రిక్ టన్నులు మార్క్‌ఫెడ్ ద్వారా వస్తుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదంటున్నారు. నానో యూరియా వాడుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది. 5,431 లీటర్ల నానో యూరియా అందుబాటులో ఉందని వారు పేర్కొంటున్నారు. ఇది 10,800 ఎకరాలకు సరిపోతుందని వారు సూచిస్తున్నారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి 39,898 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు 20,124 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. ప్రస్తుతం 830 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఇందులో ప్రైవేటు డీలర్ల వద్ద 640 మెట్రిక్ టన్నులు, సొసైటీల వద్ద 190 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది.

తప్పని తిప్పలు

అయితే అధికారులు చెబుతున్న దానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన కుదరడం లేదు. ప్రతి మండలంలో యూరియా కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఎరువుల కోసం రైతులు క్యూ కడుతున్నారు. పది రోజులపాటు విస్తారంగా వర్షాలు పడి రెండు మూడు రోజులుగా కాస్త తగ్గుముఖం పట్టాయి. దీంతో రైతులు యూరియా కొనుగోలుకు ఎగబడుతున్నారు. ఇలాంటి తరుణంలో ఎరువుల కొరత రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఒక్కో రైతుకు రెండు బ్యాగులు మాత్రమే ఇస్తుండటంతో సరిపోక అవస్థలు పడుతున్నారు. తిరిగి డీలర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. ప్రస్తుతం పత్తి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు పైపాటిగా ఎరువులు వేస్తున్నారు. ఇదే సమయంలో వరి నాట్లు కూడా ముమ్మరంగా వేస్తున్న నేపథ్యంలో యూరియాకు డిమాండ్ పెరిగింది.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు టీఆర్‌ఆర్, శంకర్, బీఎమ్మార్

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించండి

పరిగి: పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని జిల్లేడు చౌదరిగూడ మండలంలో నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, వెంటనే పనులు ప్రారంభించాలని పరిగి, తాండూరు, షాద్‌నగర్ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్ శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు అసెంబ్లీ హాల్‌లో ముఖ్యమంత్రిని కలిసి విన్నవించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తయితే తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అదే విధంగా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

బీజేపీని వదిలి కాంగ్రెస్‌పై విమర్శలా!

- రాష్ట్రానికి సరిపడా యూరియా సరఫరా చేయని కేంద్రం
- ఎరువులపై కావాలనే రాజకీయం చేస్తున్నారు
- బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుల ఫైర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు: రాష్ట్రానికి సరిపడా యూరియా సరఫరా చేయని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని వదిలి బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఆ పార్టీ నాయకులు మండిపడ్డారు. శనివారం ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యూరియా కొరతపై కేంద్రాన్ని నిలదీయాల్సిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కాంగ్రెస్‌పై విమర్శలు, ధర్నా చేయడం సరికాదని హితవు పలికారు. బీజేపీ.. బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటే అన్నారు. వాటి మధ్య లోపాయికార ఒప్పందం ఉందని విమర్శించారు. అందుకే యూరియాపై కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల పథకాన్ని ఆపేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వమే యూరియా కొరతకు కారణమని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సమావేశంలో ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్లోళ్ల రాములు, నాయకులు కల్వ కిరణ్ కుమార్, సత్యనారాయణగౌడ్, బొజ్జయ్యగౌడ్, రవీందర్, హరిచంద్, అమరేశ్వర్‌రావు, వెంకట్, ఇబ్రహీం, గఫార్, నారాయణ, అనంత్‌రెడ్డి, నర్సింలు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ భవన నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పనుల్లో వేగం పెంచండి

- కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్ రూరల్: పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను, మున్సిపల్ భవన నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో మరుగుదొడ్ల మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు, సిబ్బందికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కంప్యూటర్ గదికి సంబంధించి ఎర్తింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. గదుల్లో లీకేజీలు, విరిగిన తలుపులు, కిటికీలను సరి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ భవనంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దీపక్ శ్యామ్‌దన్‌దాస్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జినుగుర్తికి కేంద్ర మంత్రి రాక

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గ్రామ శివారులో గల ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌కు ఆదివారం ఉదయం 11 గంటలకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రానున్నట్లు సందీపని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను కేంద్ర మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారి సతీష్‌చంద్ర, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి ప్రతినిధి బాగయ్య హాజరుకానున్నట్లు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌రెడ్డి



ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పరిగి: అధిక వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి రైతులకు పరిహారం చెల్లించాలని ఏడీఏ లక్ష్మీకుమారి, తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా రైతులను ఆదుకోవాలని కోరారు. అలాగే సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అరవింద్‌రావు, ముకుంద అశోక్‌కుమార్, రాజేందర్, మాణిక్యం, తాహెర్ అలీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి సహకరించాలి

- శోభాయాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు
- తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



తాండూరు: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆదివారం జరిగే నిమజ్జన శోభాయాత్రలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగ్నా నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో 820 మండపాలు ఏర్పాటు చేశారని తెలిపారు. జిల్లాలోనే మొదటగా తాండూరు పట్టణంలో గణేశ్ విగ్రహాలను(5 రోజులకు) నిమజ్జనం చేస్తారన్నారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకం కలగకుండా పోలీసు శాఖ చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కోకట్ కాగ్నా నది వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మున్సిపల్, రెవెన్యూ, వైద్యశాఖ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తంగా ఉండి ఉత్సవాలను ప్రశాంతంగా ముగిసేలా చూడాలని కోరారు. ఊరేగింపులో డీజే సౌండ్‌కు అనుమతి లేదన్నారు.

బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలి

తాండూరు టౌన్: బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణా రెడ్డి సూచించారు. శనివారం తాండూరు లీగల్ సర్వీసెస్ కమిటీ, షీటీంల ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు బాల్యవివాహాలు చేసుకోరాదని, బలవంతంగా చేయాలని చూస్తే వెంటనే చైల్డ్ లైన్ వారికి సమాచారం అందజేయాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. వ్యసనాల బారిన పడకూడదన్నా రు. నిరంతరం శ్రమ, పట్టుదలతో చదువుపై దృష్టి సారించాలన్నారు. బాలికల రక్షణ కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో షీటీం ఎల్లవేళలా మీకు అండగా ఉంటుందన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే షీటీం సభ్యులకు తెలపాలన్నారు. నిందితులపై పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, జైలుకు పంపుతామన్నారు. అలాగే ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా పెడతా మన్నారు. సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టంపై బాలికలు అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు జిలాని, వెంకటేశ్వర్లు, ఆనంద్, షీటీం ఇన్‌చార్జ్ శేఖర్, ప్రిన్సిపాల్ స్వాతి, న్యాయవాది మల్లేశ్ యాదవ్, కోర్టు సిబ్బంది ప్రేమ్ కుమార్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

యాలాల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. శనివారం తాండూరు లీగల్ సర్వీస్ కమిటీ అధ్వర్యంలో తెలంగాణ మైనార్టీ బాలికల పాఠశాల, కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై సమాచారం ఉంటే వెంటనే షీటీం పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ.. సోషల్ మీడియాతోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ప్యానల్ న్యాయవాదులు జిలానీ, వెంకటేశ్వర్లు, ఆనంద్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం విషయంలో విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులే అని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు సబ్ డివిజన్ షీ టీం ఇన్‌చార్జి శేఖర్, న్యాయవాది మల్లేశ్ యాదవ్, కోర్టు సిబ్బంది ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ స్వాతి తదితరులు ఉన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించిన ఎస్పీ నారాయణరెడ్డి

సేవలతోనే గుర్తింపు

అనంతగిరి: విధి నిర్వహణలో మనం చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. ఉద్యోగ విరమణ పొందుతున్న అదనపు ఎస్పీ పి.వి.మురళీధర్, ఎస్‌ఐ బి.వీరన్నకు శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం మురళీధర్, వీరన్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తాండూరు, వికారాబాద్, పరిగి డీఎస్పీలు బాల కృష్ణా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, ఏఓ జోతిర్మని, జిల్లా పోలీస్ ప్రెసిడెంట్ అశోక్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

- ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు చివరి తేదీ సెప్టెంబర్ 9
- డీఈఓ రేణుకాదేవి



అనంతగిరి/తాండూరు టౌన్: జిల్లాలోని ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు కనీస అర్హత ఇంటర్ లేదా తత్సమానమైన అర్హత కలిగి ఉండాలన్నారు. శిశు విద్య లేదా ప్రైమరీ టీచింగ్‌లో అనుభవం కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. వయసు 18 నుంచి 44 ఏళ్లు ఉండాలన్నారు. అలాగే ఆయా పోస్టులకు కనీస అర్హత ఏడో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 33 ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను, అర్హత జిరాక్సు పత్రాలతో రేపటి నుంచి (1వ తేదీ) 9వ తేదీ లోగా డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఎంపికైన వారికి 10 నెలల గౌరవ వేతనం అందించనున్నట్లు చెప్పారు. ఎంపీపీఎస్ బస్వాపూర్, నవాంధ్గి, దామర్‌చేడ్, సాలిమ్దాపూర్, కన్మన్‌కల్వ, టాక్రియా నాయక్ తండా, దోర్నాల్, ఇలాబాద్ తండా, ఐనాపూర్, అల్లాపూర్, పోల్కంపల్లి, గౌరారం, నజ్కాన్ పల్లి, ఏకే తండా, అన్నాసాగర్, రామ్రెడి పల్లి, కట్టేపహాడ్ తండా, మల్లికార్జునగిరి, పిల్లిగండ్ల, షాపూర్, చక్రంపల్లి, లాచియానాయక్ తండా, ఎన్కేపల్లి, కేశవపల్లి, రంగాపూర్, ఖుద్వాండపూర్, రావులపల్లి, మల్లెమోనిగూడ, సయ్యద్‌మల్కాపూర్, ఓగిపూర్, చెంగేష్‌పూర్, సంగెంఖుర్దు, చెన్నారం ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నట్లు డీఈఓ తెలిపారు.

క్లుప్తంగా

పౌరులందరూ సమానమే

ఎస్‌ఐ అరవింద్

మోమిన్‌పేట: దేశంలోని పౌరులందరూ సమానమేనని ఎస్‌ఐ అరవింద్ అన్నారు. శనివారం మండల పరిధిలోని మేకవనంపల్లి గ్రామంలో పౌర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు అందరికి సమానమేనన్నారు. ప్రతి పౌరుడు హక్కులను తెలుసుకోవాలని సూచించారు. అంటరానితనం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సరిత, వార్డెన్ జైపాల్‌రెడ్డి, కార్యదర్శి సుగుణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతీ విగ్రహానికి జియో ట్యాగింగ్

ప్రతీ వినాయకుడికి జియో ట్యాగింగ్ చేశామని ఎస్‌ఐ అరవింద్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని ఎన్కేపల్లిలో ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద ప్రత్యేక పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 130 గణనాథులను ఏర్పాటు చేశారన్నారు. ప్రశాంత వాతవరణంలో నిమజ్జన కార్యక్రమాలు చేసుకోవాలని సూచించారు. డీజేల ఏర్పాటుకు అనుమతి లేదన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీలు చొరవ తీసుకోవాలన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి


కృష్ణయ్య(ఫైల్)

పరిగి: బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దోమ మండల పరిధిలోని గూడూరు గ్రామానికి చెందిన జెజ్జయ్యల కృష్ణయ్య(40) శుక్రవారం తనబైక్‌పై పరిగి పట్టణ కేంద్రానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో రాఘవపూర్ సమీపంలో ఓ టిప్పర్ ఆయన ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కృష్ణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు వెంటనే వికారాబాద్‌కు తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య లలిత, కుమారుడు భరత్ ఉన్నారు.

అసత్య ప్రచారాన్ని సహించం

లంబాడీ హక్కుల నేత గోవింద్‌నాయక్


పరిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పరిగి: లంబాడీపైల అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ అన్నారు. పలు బంజారా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింధూ నాగరికత కాలం నుంచే లంబాడీలు గిరిజనులుగా ఉన్నారన్నారు. బ్రిటీష్ కాలంలోనూ ఇదే పట్టికలో చూపించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రాంతానికి చెందిన లంబాడీలను గిరిజనుల జాబితాలో చేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు లంబాడీలను గిరిజనుల జాబితా నుంచి తొలగించాలని న్యాయస్థానంలో రిట్ పిటిషన్ వేయడం సరికాదని తెలిపారు. దీనికి కారణం ఎవరనేది ప్రభుత్వంతో పాటు సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లంబాడీల ఓట్లతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేందర్‌నాయక్, రవీందర్, సేవ్య, శంకర్ నాయక్, చందు, పాడు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పరిగి: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేష్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో శనివారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలతో భావి తరాలకు ఉపయోగం ఉంటుందన్నారు.పంచాయతీ కార్యదర్శి బుచ్చయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులు, నర్సింహారెడ్డి, ఈశ్వరయ్య, పాల్గొన్నారు.

రాత్రి అరుపులు.. పగలు దాడులు



వీధి కుక్కల బెడద తగ్గించేందుకు ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చిస్తున్నా కుక్కకాటు తప్పడం లేదు. ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. నిత్యం ఎక్కడో ఓ చోట కుక్క కాటు బాధితులు ఆస్పత్రులకు పరుగులు పెడుతూనే ఉన్నారు. గతంలో రేబిస్ సోకి చనిపోయిన ఘటనలు లేకపోలేదు.

పిక్కలు పీకుతున్న కుక్కలు

- పెరిగిపోతున్న కుక్కకాటు బాధితులు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న జనం
- ప్రతీ నెల వందల సంఖ్యలో కేసులు

నాలుగు నెలల్లో 39 కేసులు

కొడంగల్ రూరల్: అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్క కాటుకు సంబంధించిన మందులతో పాటు సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ బుస్రా ఫాతిమా తెలిపారు. శనివారం మండల పరిధిలోని అంగడిరాయిచూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాగ్ బైట్స్‌కు సంబంధించిన వివరాలను కోరగా కుక్క కాటుకు గురైనవారికి ఐదు డోసుల ట్రీట్‌మెంట్ ఇస్తామన్నారు. 0, 3, 7, 14, 28 రోజులలో ఐదు డోసులుగా మందులను అందిస్తున్నామని, మేలో తొమ్మిది, జూన్‌లో 13, జులైలో ఎనిమిది, ఆగస్టులో తొమ్మిది కేసులు నమోదయ్యాయని చెప్పారు.


ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బుస్రాఫాతిమా

మూడేళ్ల వ్యవధిలో 6,370 కేసులు

తాండూరు: తాండూరు పట్టణంలో వీధి కుక్కలు బెడద తీవ్రంగా ఉంది. ప్రతి రోజు ఏదో ఒక ప్రాంతంలో వీధికుక్క కాటుకు బలవుతున్నారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో తాండూరు నియోజకవర్గంతో పాటు ఇతర మండలాల నుంచి ఈ తరహా కేసులు పెద్ద ఎత్తున నమోదయ్యాయి. ఈ ఏడాది మే–ఆగస్టు వరకు 1,135 కుక్క కాటు కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలుస్తోంది. 2023 జనవరి – 2025 ఆగస్టు నెలాఖరు వరకు 6,370 కుక్క కాటు కేసులు నమోదయ్యాయని జిల్లా ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి. ఇక్కడ కుక్కకాటుకు సరిపడ రేబిస్ మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలుపుతున్నారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని పాత తాండూరు, గొల్ల చెరువు, గాంధీనగర్, ఇందిరానగర్, మల్‌రెడ్డిపల్లి, రాజీవ్‌కాలనీ, సాయిపూర్ ప్రాంతాల్లో వీధికుక్కలు బారిన పడిన కేసులు ఎక్కువవగా నమోదయ్యాయి. ఇందులో చిన్నారులే అధికం. ఇటీవల పెంపుడు కుక్కలు సైతం యజమాని కుటుంబీకుల పిక్కలు పీకుతున్నాయి. తాండూరు పట్టణంలో పెంపుడు కుక్క ఓ చిన్నారిని కరవడంతో ప్రాణాలే కోల్పోయింది.

మాంసపు దుకాణాల వద్ద వీధి కుక్కల గుంపులు

పట్టణంలో ఇటీవల మాంసపు దుకాణాలు విపరీతమయ్యాయి. దీంతో వీధి కుక్కలు మాంసపు దుకాణాల వద్ద గుంపులుగా చేరుతున్నాయి. వాటికి అలవాటు పడిన వీధి కుక్కలు మాసం దొరకని సమయంలో రోడ్లపై పోయేవారినపై దాడులకు పాల్పడుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలను అరికట్టేందుకు మున్సిపల్ అధికారులు కొన్ని రోజుల పాటు నియంత్రణ కార్యక్రమం చేసి మధ్యలోనే వదిలేశారని ఆరోపిస్తున్నారు. దీంతో మళ్లీ వీధి కుక్కలు బారిన పడాల్సి వస్తోందని వాపోతున్నారు.


వీధి కుక్క దాడిలో ఓ వ్యక్తి కాలికి గాయం

షాద్‌నగర్‌లో ఆస్పత్రికి బాధితుల క్యూ

షాద్‌నగర్: ఒకప్పుడు వీధి కుక్కలను గ్రామ సింహాలుగా, గ్రామ రక్షక్షులుగా అభివర్ణించేవారు. ప్రస్తుతం కుక్కలంటేనే జనం బెంబేలెత్తుతున్నారు. గతంలో పిచ్చి వచ్చిన కుక్కలు మాత్రమే కరిచేవి. ప్రస్తుతం మనుషులు కనిపిస్తే చాలు వారి పిక్కలు పీకుతున్నాయి. ఫలితంగా కుక్క కాటు బాధితులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.


కుక్క కాటుకు గురైన వెలిజర్ల గ్రామస్తుడు (ఫైల్)

ఒక్క నెలలో 170 కేసులు నమోదు

పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో ఆగస్టు మాసంలో 170 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. పట్టణంతో పాటుగా, వివిధ గ్రామాలకు చెందిన కుక్క కాటు బాధితులు ఆసుప్రతికి వచ్చి చికిత్సలు చేయించుకుంటున్నారు. జూలైలో 195 కుక్క కాటు, మూడు పిల్లి కాటు, 12 పాముకాటు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు.

కుక్కలకు 'ఏబీసీ'

వీధి కుక్కల బెడద నివారణకు షాద్‌నగర్ మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందుకు పట్టణ శివారులో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. కాలనీల్లోని కుక్కలను పట్టుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి యాంటి రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నారు.

అందుబాటులో మందులు

కుక్క, పాము కాట్లకు సంబంధించిన అన్ని రకాల మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు బాధితులుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి.

పట్టుకున్న చోటే వదిలేస్తున్నారు

మీర్‌పేట: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల దాడులతో జనం ఆందోళన చెందుతున్నారు. శస్త్ర చికిత్సల పేరిట వీధి కుక్కలను పట్టుకెళ్లడం ఆపరేషన్లు చేయడం మరలా పట్టుకున్న చోటే వదిలేయడంతో రాత్రి వేళ అరుపులు... పగటి పూట దాడులకు పాల్పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలకు ఆపరేషన్లు చేయడం తప్ప నియంత్రణకు మున్సిపల్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

మూడు నెలల్లో 350కి పైగా కేసులు

బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వీధి కుక్కల దాడి ఘటనలు ఎక్కువగానే ఉన్నాయి. గత మూడు నెలల్లో దాదాపు 350కి మందికి పైగా కుక్కల దాడిలో గాయపడ్డారని, ఆస్పత్రికి వచ్చిన వారందరికి వ్యాక్సిన్లు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కుక్కకాటుకు సంబంధించిన వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.

నెలకు 30కిపైగా బాధితులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని గ్రామాల్లో నెలకు 30కి పైగానే కుక్క కాటు బాధితులు ఉన్నారు. ప్రతీ గ్రామంలో వందకు పైగానే కుక్కలు ఉన్నాయి. జూన్, జూలై, ఆగస్టు నెలలో వరుసగా 41, 38, 36 మంది కుక్కల కాటుకు గురైనట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. కేవలం ప్రాథమిక ఆసుపత్రికి వచ్చిన వారే. ఇంకా కొంత మంది ప్రైవేట్, ఇతర జిల్లా ఆసుపత్రులకు వెళ్లిన వారు అదనం.

'అటుకు' జిల్లా కమిటీ ఎన్నిక


నాటకోపాధ్యాయుల జిల్లా కమిటీ

బొంరాస్‌పేట: తెలంగాణ జానపద కళల్లో ఒకటైన వీధినాటక ఉపాధ్యాయులు ఏకమయ్యారు. కళను బతికించాలని సంఘటితయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 60మంది కమిటీగా ఏర్పాటయ్యారు. దీనికి ×అటుకు? (నాటకం వేదిక) అని పేరు పెట్టారు. శనివారం మండల పరిధిలోని తుంకిమెట్లలో జరిగిన సమావేశంలో 9మందితో జిల్లా కార్యవర్గాన్ని ఏకవగ్రీవంగా ఎన్నుకున్నారు. బషీరాబాద్ మండలం కాశీంపూర్‌కు చెందిన కుర్వ అంజిలయ్య జిల్లా అధ్యక్షుడిగా, గౌరవ అధ్యక్షుడిగా బొంరాస్‌పేట మండలం చౌదర్‌పల్లికి చెందిన చాకలి రాములు, సలహాదారులుగా ఏర్పుమళ్లకు చెందిన గంజిపల్లి పెద్దరామయ్య, రేగడిమైలారానికి చెందిన మొండి మైసప్ప, ప్రధాన కార్యదర్శిగా పెద్దేముల్ మండలం రాములు, ఉపాధ్యక్షుడిగా పరిగి మండలం మిట్టకోడూర్ హన్మయ్య, సహాయ కార్యదర్శిగా ధారూరు మండలం అమృతయ్యగౌడ్, కోశాధికారిగా కొడంగల్ మండలం అన్నారం చిన్న రాములు, ప్రచార కార్యదర్శిగా బొంరాస్‌పేట మండలం మాలెకాడిపల్లె శివకుమార్, కార్యదర్శులుగా బంట్వారం రఘుపతిరెడ్డి, కొత్తూరు మెంకటయ్య, మెట్లకుంట వెంకటయ్య తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా చాకలి వెంకటయ్య, నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా మద్దూరు నాయకుని హన్మంతును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీధినాటక కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులిచ్చి రూ.15 వేల నెలవారీ పింఛన్ లేదా భత్యం, ఇందిరమ్మ డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాల ప్రచారానికి వీరిని వినియోగించాలన్నారు. మెట్లకుంట వెంకటయ్య, కొత్తూరు వెంకటయ్య తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


పద్మమ్మ(ఫైల్)

పరిగి: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళా మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని మాదారంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మోహనకృష్ణ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పద్మమ్మ(40) భర్త నర్సింలు కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమె కూతురుకు పెళ్లి చేసి అత్తారింటికి పంపించి ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఉదయం కల్లు దుకాణం ఎదుట సందులో ఓ మహిళ మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహంపై గాయాలుండడంతో హత్యగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీం సహకారంతో ఆధారాలు సేకరించారు. కల్లు దుకాణం నడిపిస్తున్న వ్యక్తిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మృతురాలి కూతురు సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రవికుమార్ సేవలు అభినందనీయం

జిల్లా ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్


రవికుమార్‌ను సన్మానిస్తున్న జ్ఞానేశ్వర్

తాండూరు రూరల్: తాండూరు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రవి కుమార్ సేవలు అభినందనీయమని జిల్లా ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో రవికుమార్ పదవీవిరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఫారెస్ట్ విభాగంలో 34 సంవత్సరాలు పని చేశారని గుర్తు చేశారు. అడవుల సంరక్షణలో రవికుమార్ సేవలు మరవలేని వన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓలు శ్రీదేవి, రాజేందర్, శ్యామ్ కుమార్, సావిత్రి, సెక్షన్ ఆఫీసర్ ఫిర్యానాయక్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఇన్‌చార్జి ఎంపీఓ భాస్కర్ గౌడ్

కుల్కచర్ల: మాంసహార వ్యాపారులు, దుకాణదారులు దుకాణసముదాయాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఎంపీఓ భాస్కర్ గౌడ్ హెచ్చరించారు. శనివారం కుల్కచర్ల గ్రామ పంచాయతీలో మండల కేంద్రంలోని మాంసహార దుకాణదారులతో సమీక్ష నిర్వహించి వారికి నోటీసులు ఇచ్చారు. రోడ్డుపై మాంసాహారం విక్రయించొద్దని, మృతిచెందిన మేకలు, గొర్రెలను అమ్మొద్దని సూచించారు. ఆరోగ్యకరమైన మాంసాహారాన్ని అమ్మాలని, దుకాణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యర్థాలను డంపింగ్‌యార్డు దగ్గరలో వేసేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బంది లేకుండా వ్యాపారాన్ని నిర్వహించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, మాంసాహార దుకాణదారులు నర్సింలు, కృష్ణోజీ, కృష్ణ, బాలాజీ, కటికె సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


దుకాణదారులకు నోటీసులను ఇస్తున్న భాస్కర్ గౌడ్

మార్కెట్ అభివృద్ధికి రూ.1.97 కోట్ల రుణం

ధారూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం గుడిమల్కాపూర్ మార్కెట్ నుంచి రూ.1.97 కోట్ల రుణం తీసుకున్నామని ధారూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు మార్కెట్ కమిటీ రాష్ట్ర కార్యదర్శికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సిఫారసు చేయడంతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. అప్పుగా తెచ్చిన డబ్బులతో మార్కెట్ చుట్టూ ప్రహరీ, మార్కెట్ వెనక భాగంలోని ఎకరా స్థలానికి ప్రహరీతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, మరుగుదొడ్లు, నూతన కార్యాలయ భవనం నిర్మిస్తామని స్పష్టంచేశారు. మార్కెట్ వెనకాల ఉన్న స్థలంలో మేకల బజార్ నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకోసం రూ.68 లక్షలతో షెడ్డు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రూ.50 లక్షలతో మార్కెట్‌లో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు.


మాట్లాడుతన్న మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

పోలీసుల అదుపులో నిందితుడు

దౌల్తాబాద్: పాతకక్షలతో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటన మండల పరిధి ఈర్లపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లోడుగుల బాబు, బీమప్పలు వరుసకు మామ అల్లుళ్లు. కాగా బీమప్ప తల్లి సావిత్రమ్మ పదేళ్ల క్రితం చనిపోయింది. ఆమె మృతికి బాబే కారణమని అనుమానించిన బీమప్ప.. అతడిపై పగ పెంచుకున్నాడు. ఉపాధి నిమిత్తం నగరానికి వలస వెళ్లిన బీమప్ప.. నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. బాబు ఇంట్లో వినాయకుడిని ప్రతిష్ఠించిన సందర్భంగా శనివారం అన్నదానం చేశారు. ఇందులో పాల్గొన్న బీమప్ప.. బాబును మాటల్లో దింపి, శివారులోని పోచమ్మ ఆలయం వద్దకు తీసుకెళ్లి దాడికి పాల్పడ్డాడు. కొడవలితో తలభాగం, కడుపులో పొడిచాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాబు పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కాగా నిందితుడిని దౌల్తాబాద్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.


బాబును ఆస్పత్రికి తరలిస్తున్న గ్రామస్తులు

స్థానిక ఎన్నికలకు సహకరించండి


మోమిన్‌పేట: మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి


యాలాల: రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశమైన ఎంపీఓ యాదయ్య


కుల్కచర్ల: ఆయా పార్టీల నేతలతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ


కొడంగల్ రూరల్: అఖిలపక్ష పార్టీల నాయకులతో ఎంపీడీఓ ఉషశ్రీ


తాండూరు రూరల్: రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీఓ విశ్వప్రసాద్

ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: స్థానిక ఎన్నికలకు ప్రతీ ఒక్కరు సహకరించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోవు స్థానిక ఎన్నికల్లో అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఓటరుల జాబితాలో తప్పులుంటే సవరణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, సీపీఐ, బీఆర్‌ఎస్, ఎంఐఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు లేకుండా చర్యలు

యాలాల: ఓటరు జాబితాలో అభ్యంతరాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మండల పంచాయతీ అధికారి గాలి యాదయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల్లో ప్రదర్శించిన ముసాయిదా ఓటరు జాబితాలో అభ్యంతరాలను తెలుసుకున్నారు. భార్యభర్తల ఓటు హక్కు ఒకటే వార్డులో లేవని, అటువంటి ఓటరు విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మార్పులు చేస్తామన్నారు. సెప్టెంబరు 2న ఫైనల్ ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. మండలంలో మొత్తం 38వేలకు పైగా ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, శివకుమార్, వెంకటయ్యగౌడ్, మల్కయ్య, బుగ్గప్ప తదితరులు ఉన్నారు.

తప్పులుంటే కార్యదర్శులకు చెప్పండి

కుల్కచర్ల: ఓటర్ల వివరాలలో అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా పార్టీల నేతలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన నియమనిబంధనల ప్రకారం గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల వివరాలను ప్రకటించామని, మార్పులు ఉంటే ఆయా గ్రామాల కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు మైపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

కొడంగల్ రూరల్: ఓటరు జాబితా అభ్యంతరాలపై పార్టీల నాయకులతో శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఉషశ్రీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెద్ద నందిగామ, అంగడిరాయిచూర్, హస్నాబాద్ తదితర గ్రామాల నుంచి 180 అభ్యంతరాలు వచ్చాయని, వాటిని సరిచేస్తూ సెప్టెంబర్ 2వ తేదీన తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్, పెద్దనందిగామ సత్యనారాయణరెడ్డి, సీపీఐ నాయకులు ఇందనూర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో..

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఓటరు జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శించామన్నారు. తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీహరి, నారాయణరెడ్డి ఉన్నారు.

తప్పులు సరిచేయండి

బషీరాబాద్: ఓటరు జాబితాలో పేర్లు, వార్డులు తప్పులు దొర్లాయని రాజకీయ నేతలు అధికారుల దష్టికి తీసుకెళ్లారు. వెంటనే వాటిని సరిచేయాలని సూచించారు. శనివారం బషీరాబాద్ ఎంపీడీఓ తిరుముల స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రామ్‌రెడ్డి, మాధవరెడ్డి, చందర్‌నాయక్, శాంతి భాయి, అనిల్‌కుమార్‌గౌడ్, సతీశ్, నర్సిరెడ్డి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో అక్కడక్కడా డబుల్ ఓట్లు ఉన్నాయని వాటిని తొలగించాలని సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేయాలని రాజకీయ నేతలు సూచించారు.